జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 22-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 433 పేజీలు: 4 వెల: రూ.7




## కలమట, మామిడి మధ్య..
# వర్గ పోరు

* నేతల నడుమ నలిగిపోతున్న కార్యకర్తలు
* ఆధిపత్య ధోరణితో బలం పెంచుకుంటున్న ప్రత్యర్థి పార్టీ
* ఇదిలా కొనసాగిస్తే పార్టీకి గడ్డుకాలమే అంటున్న శ్రేణులు

**కొత్తూరు, ఆగస్టు 21 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి గడ్డుకాలం సమీపిస్తోందని ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మధ్య సాగుతున్న అంతర్గత వర్గపోరు, ఆధిపత్య ధోరణి మధ్య పార్టీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడం, ఎవరి దారి వారు చూసుకోవడం, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయం లేకపోవడంతో కార్యకర్తల పరిస్థితి ముందుకెళితే నుయ్యి.. వెనుకకు వెళితే గొయ్యి మాదిరిగా తయారైంది. ఇటీవల నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి అలాగే పాతపట్నం నియోజకవర్గంలో అధికార పార్టీ చేస్తున్న ఏ ఒక్క కార్యక్రమాలకు కూడా జిల్లా అధ్యక్షుడు వెంకటరమణను మామిడి వర్గం ఆహ్వానించలేదు. దీనిపై కలమట వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది. ఇక కలమట వర్గానికి చెందిన వారిని మామిడి వర్గం దగ్గరకు సైతం తీసుకోవడం లేదు. ఆ వర్గం పనులు ఏ ఒక్కటి కూడా ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. తమ వారికి సంక్షేమ పథకాలు రాకుండా చూస్తున్నారని కలమట వర్గం బహిరంగంగానే ఆరోపిస్తుంది. ఇదే విషయం అనుచరులు కలమట దృష్టికి తీసుకువెళ్లారు. కలమట వర్గం సైతం మామిడి వర్గం చేస్తున్న అక్రమాలు, అన్యాయాలపై ఏకంగా సోషల్ మీడియా వేదికగా బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. అంతేగాకుండా పార్టీ అధిష్టానంతో పాటు జిల్లాకు చెందిన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అధిష్టానం అప్పగించిన కార్యక్రమాలను సైతం ఎవరికి వారుగా చేపడుతున్నారు. టీడీపీలో రెండు వర్గాల మధ్య వర్గపోరు వల్ల ప్రతిపక్ష పార్టీ వైసీపీకి లబ్ధి చేకూరుతోంది. నేతల మధ్య నలిగిపోవడం కన్నా వైసీపీలో చేరిపోవడం మిన్నగా కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ అంతర్గత పోరును ఇకనైనా చెక్ పెట్టకపోతే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం కష్టమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




## అవునా..
# ఇది నిజమా!

* టీడీపీ, వైసీపీ సామాజిక మధ్యమాల్లో చక్కర్లు కొట్టిన 'జాతీయ వార్త' కథనం
* ఏ ఇద్దరు నేతలు కలిసినా ఇదే అంశంపై చర్చ
* యంత్ర పరికరాల కాంట్రాక్టుల్లో అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలన్న వైసీపీ నేతలు
* ఈ అంశంపై ఎక్కడా నోరుమెదపని మంత్రి

**శ్రీకాకుళం, ఆగస్టు 21 (వార్త):** 'జాతీయ వార్త'లో ప్రచురితమైన 'అచ్చెన్న.. ఇదేంటన్న' అన్న కథనం టీడీపీ, వైసీపీలో చర్చకు దారితీసింది. ఈ కథనం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇలా చేశారా.. ఇది నిజమా అంటూ కొందరు వాకబు చేయడం కనిపించింది. ఈ కథనానికి తోడు ఒకవైపు వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మరోవైపు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి అచ్చెన్న అక్రమాలపై పూసగుచ్చినట్టు వివరించారు. అయితే ఈ అంశంపై మంత్రి ఎక్కడ కూడా ప్రస్తావించకపోవడం, ఖండించకపోవడం చూస్తే వైసీపీ నేతలు చెప్పింది నిజమేనా అన్న అనుమానాలు కలుగకమానదు.

### మంత్రి అవినీతి దందాపై దర్యాప్తు చేయాలి

**ఆమదాలవలస:** వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అవినీతి దందాపై సమగ్ర దర్యాప్తు చేయాలని మాజీ స్పీకర్, వైసీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ తమ్మినేని సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆమదాలవలసలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను వ్యక్తిగత లాభం కోసం మంత్రి అచ్చెన్న దోపిడీ సాధనాలుగా మలచడం సరికాదన్నారు. పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు, కమీషన్ల కోసం అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ అని విమర్శించారు. ఈ విషయంలో మంత్రి ఓఎస్డిపైన నిఘా సంస్థలు విచారించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

### వ్యవసాయ యంత్ర కాంట్రాక్టులో అక్రమాలు

#### వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

**శ్రీకాకుళం, ఆగస్టు 21 (వార్త):** రైతు ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వ్యవసాయ యంత్ర పరికరాల కాంట్రాక్టుల్లో అవకతవకలు చోటుచేసుకోవడంపై మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఆగ్రోస్ జీఎం రాజమోహన్ ప్రభుత్వానికి రాసిన లేఖతో ఈ వ్యవహారం బయటపడిందన్నారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో కృష్ణదాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందాల్సిన యంత్ర పరికరాల పథకాన్ని కూడా కాంట్రాక్టుల ముసుగులో అవినీతికి వాడుకోవడం బాధాకరమన్నారు. నిజాయితీ గల అధికారిని ఒత్తిడులు తట్టుకోలేక సెలవుపై వెళ్లే పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు. అగ్రోస్ ఆధ్వర్యంలో జరుగుతున్న యంత్రపరికరాల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో టెక్కలి, ఆమదాలవలస పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ ముఖ్య నాయకులు అందవరపు సూరిబాబు, గొండు రఘురాం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, యువ నాయకులు మెంటాడ స్వరూప్ పాల్గొన్నారు.



## ఆడపడుచులపై
# నిందలు వేస్తారా?

* చింతాడను వదిలేది లేదు
* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**శ్రీకాకుళం, ఆగస్టు 21(వార్త):** దైవ దర్శనానికి వెళ్లిన ఆడపడుచులపై దుష్ప్రచారం చేసి నిందలు వేయడం క్షమించరాని నేరమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక మహిళను అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఆడపడుచులపై నీచంగా మాట్లాడిన చింతాడను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై తమకు ఫిర్యాదులు అందాయని... వాటిని ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వారు విచారించి, తదుపరి చర్యలు తీసుకుంటారని చెప్పారు. అలాగే మహిళా నేతలు మాట్లాడుతూ అసభ్యకరంగా మాట్లాడుతున్న చింతాడ రవిని చెప్పుతో కొడతామన్నారు. మాట్లాడేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు తదితరులు పాల్గొన్నారు.



# జానపదం.. దేవరాజు పథం

* కళాకారులను తీర్చిదిద్దుతున్న 'మల్లేన' * ఉద్దానం కేంద్రంగా కళలకు ప్రోత్సాహం * సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక స్థాపన * యూట్యూబ్ ద్వారా సిక్కోలు జానపదానికి ప్రచారం * కవిగా, కళాకారునిగా, గాయకునిగా, దర్శకునిగా, డాన్సర్‌గా బహుముఖ ప్రజ్ఞ



**మందస, ఆగస్టు 21(వార్త):** ఉద్దానం కళలకు పుట్టినిల్లు.. జానపదాలకు నిలయం.. ఎందరో కళాకారులు ఉద్దానం నుంచి వచ్చినవారే.. సుబ్బారావు పాణిగ్రహి వంటి కళాకారుడు జముకుల కథతో ఎంతో ప్రాచుర్యం పొందారు. గజ్జె కట్టి నర్తిస్తే.. పాటకు ప్రాణం పోస్తారీ కళాకారులు. ఉద్దానానికి ఊపిరి కళలని చెప్పవచ్చు. నేటికీ ఎందరో కళాకారులు నాటి సంప్రదాయాలు, కళలు, జానపదాలను అంతరించిపోకుండా కాపాడుతున్నారు. అదే దారిలో ప్రముఖ కళాకారుడు మల్లేన దేవరాజు పయనిస్తున్నారు. చిన్నతనం నుంచే కళలపై మక్కువ పెంచుకున్న దేవరాజు నేడు రచయితగా, కళాకారునిగా, గాయనికుగా, నాట్యకళాకారునిగా, దర్శకునిగా బహుముఖ ప్రజ్ఞశాలిగా తన ప్రతిభ చాటిచెబుతున్నారు. ఆదర్శకునిగా తన పిల్లలను కూడా కళాకారులుగా తీర్చిదిద్దుతునే.. ఎందరో కళాకారులను తయారు చేస్తున్నారు. ఉద్దానం కళలు బతికే ఉన్నాయని చెప్పడానికి కళాకారులతో పలు ప్రదర్శనలు కూడా ఇస్తుంటారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీ మల్లేనవారిపేట గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు మల్లేన దేవరాజుపై ప్రపంచ జానపదదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 1986వ సంవత్సరంలో మల్లేన రామన్న, పార్వతి దంపతులకు 14వ సంతానంగా దేవరాజు జన్మించారు. ప్రకృతికి నిలయమైన పచ్చని ఉద్దానంలో పక్షులు కిలకిలలు, ఆలమందలు గూటికి చేరే సమయం, తమ లేగ దూడలు అంబా అంబా అంటూ పరుగు పరుగున తల్లిని వెతుకులాడే చప్పుళ్ల మధ్య ఆయన బాల్యం సాగింది. పశు పక్షాదులతో స్నేహంగా పెరిగిన తీయటి అనుభవం. పక్క గ్రామాలైన నారాయణపురం, హరిపురంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని, ఆపై చదువుల కొరకు శ్రీకాకుళం ఆర్ట్ కళాశాలలో చేరి, చదువుతూ, ఎస్ఎఫ్ఐ సంస్థలో పనిచేస్తూ తోటి విద్యార్థులకై పాటు పడుతూ, చదువు పూర్తి చేసుకుని, తిరిగి స్వస్థలానికి చేరుకుని గ్రామంలో విద్యార్థులు అస్తవ్యస్త పరిస్థితులు చూసి వారికై రాత్రి బడిని ప్రారంభించారు. అదే సమయంలో తాను చదివిన పాఠశాలలో విద్యావలంటీర్ గా చేరి, అటువంటి అవకాశాన్ని వినియోగించుకొని ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. గౌతమి అనే అమ్మాయిని వివాహం చేసుకున్నారు. మధ్యతరగతి కుటుంబం కావడంతో చాలీచాలని సంపదతో గ్రామాన్ని విడిచి వలస బాట పట్టవలసి వచ్చింది. పిల్లనిచ్చిన మామ అప్పారావు సహాయంతో ముంబాయిలో ఎఎస్ఎంటీ అనే కోర్సు పూర్తి చేసుకుని గుజరాత్ రాష్ట్రంలో ఉద్యోగం సంపాదించారు. కొన్ని రోజుల తర్వాత ఆ రాష్ట్రాన్ని విడిచి కాశ్మీర్, కేరళ రాష్ట్రాలు



తప్ప అన్ని రాష్ట్రాలలో ఉద్యోగరీత్యా పని చేయసాగారు. చివరికి 2010 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రం, బళ్లారి జిల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్లో క్వాలిటీ డిపార్ట్మెంట్లో చేరి, ఇప్పటికీ అందులో కొనసాగుతున్నారు. 2015వ సంవత్సరం వలస బ్రతుకుతూ.. అనేక ఇబ్బందులు పడుతున్న ఆంధ్రుల కోసం ప్రవాసాంధ్రులు సేవా సమితిని ఏర్పాటుచేసి అధ్యక్షుడుగా దాసరి సుధీర్, కోశాధికారిగా రావడ సోంబాబు నియమించి అనేక వలస కుటుంబాలకు సహాయసహకారాలు సంస్థ ద్వారా అందజేశారు. పుట్టకతో వచ్చిన నేపథ్యం కారణంగా జన్మనిచ్చిన ప్రాంతం రుణం తీర్చుకోవాలని, పల్లె యాసను, పల్లె పాటను, కనుమరుగవుతున్న జానపద కళలను రక్షించుకోవాలని సంకల్పించారు. ఓ రోజు ఫేస్బుక్ మెసెంజర్ లో తన మిత్రుడైన ఉద్దానం రాజన్నఅలియాస్ మర్ల రాజారావు ఫోన్ లో మాట్లాడుతూ మన ప్రాంతం కళాకారులు, కళలు మెల్లమెల్లగా కనుమరుగవుతున్నాయని చెప్పడంతో దేవరాజు వేదన పడ్డారు. కళలకు పూర్వ వైభవాన్ని ఈ తరానికి అందివ్వాలని, ఈ ప్రాంతం కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయాలనే సామాజిక బాధ్యతను దృఢంగా సంకల్పించుకొని మదన పడుతున్న మదిలో పుట్టిన ఆలోచనే తేది.30 అక్టోబర్ 2019వ సంవత్సరంలో వాట్సాప్ గ్రూపుగా రూపం ఎత్తి, సిక్కోల జానపద సాహిత్య కళావేదికను ఏర్పాటు చేశారు. సంస్థ ఏర్పాటు అయింది కానీ, ప్రజలలోకి ఎలా తీసుకొని వెళ్లాలని ఆలోచిస్తూ, తన మిత్రుడైన బొడ్డు గాంధీ, రాపాక ధనరాజులతో చర్చించి చేసి ఉపాధ్యాయుడు దున్న రామారావు, బత్తిని రామారావులను కలుపుకొని ముందుకు సాగుతున్న తరుణంలో మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు ప్రాంతం అనుభవాలను జత చేర్చుకుంటూ, ఇచ్ఛాపురం మండలం నుండి వజ్రపు కొత్తూరు మండలం పరిధిలో ఉన్న ఉద్దానం తీర ప్రాంతాలలో గల అనేకమంది కళాకారులు, యువతీ, యువకులను కలుపుకోవడం ప్రారంభించారు. అలాంటి సందర్భంలో దొరికిన మట్టిలో మాణిక్యాలే సాలిన అశోక్ కుమార్, నక్క వాసు. జన్మభూమి కోసం, జానపదాల కోసం ఎండనకా, వాననక ప్రతిరోజు పల్లె పల్లె తిరుగుతూ. కొంతమంది యువకులను, ఒక కూటమిగా చేర్చి పక్క జిల్లా విజయనగరం అనుభవజ్ఞులైన కళాకారులతో సంప్రదింపులు చేసి ప్రధానంగా మందస మండలంలోని, పెద్దబహడపల్లి గ్రామంలో ఉద్దానం కళాపోషకులు సహాయంతో రేలారే రేలా జానకి రావు ముఖ్య అతిథిగా కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది . అలా అక్కడి నుంచి మొదలు ఇప్పటివరకు పలు కార్యక్రమాలు పూర్తి చేసుకొని, అనేకమంది కళాకారులను, ఉద్దానం ప్రాంతపు కళలను ప్రపంచానికి పరిచయం చేయడం చేస్తున్నారు. ఈ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంస్థగా మారింది. సిక్కోలు







జానపద సాహిత్య కళా వేదిక వ్యవస్థాపకునిగా మల్లేన దేవరాజు ఇది కొంతవరకేనని భావించి యూట్యూబ్ చానెల్(మల్లేన మీ టీవీ)ను పెట్టి తన సొంత ఖర్చులతో ప్రాచీన జానపదాలను, మట్టిలో మాణిక్యాలను వెతికి పట్టి, రికార్డింగ్లు చేసి ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. తన యూట్యూబ్ చానెల్ లో సాలిన అశోక్ కుమార్, నక్క వాసు, మర్ల దిలీప్, సంతు గురువు, మణిదీప్, తేజు, చేపూరి శ్రీవర్షిత, నిర్మల, నాగురు జ్యోష్న, ప్రియ, చంద్రిక, ఐక్య రమేష్, ముంగడ రాము, లింగుడి రాజు, మద్దిల నారాయణ, సరస్వతి, షేక్ స్మారికా, రాజేశ్వరి (తెలంగాణ), చంద్రశేఖర్(తెలంగాణ), రాము(తెలంగాణ), రాజేంద్ర(తెలంగాణ), ఆది(వైజాగ్), జయరాం(తెలంగాణ), శైలజ(తెలంగాణ) తదితరులను కళాకారులుగా తీర్చిదిద్దారు. దేవరాజు బాల్యంలోనే పలు నాటికలు రచించారు. 4, 5వ తరగతి చదువుతున్నప్పుడు సమాజంలో ఆడపడుచు, వరకట్నం, వాడి వేడి వలస బ్రతుకులు రచించారు. వీటిని తన సొంత గ్రామ స్నేహితులకు నేర్పించి, పలు గ్రామాలలో ప్రదర్శించారు. వీటితో పాటు గరిడీ, కర్రసామును తన తండ్రి గారి వద్దనే బాల్యంలో నేర్చుకుని, పలు గ్రామాలలో నేటికీ ప్రదర్శన చేస్తున్నారు. ఆయన రాసిన పాటలు, జానపదాలు, సామాజిక గేయాలు, విప్లవ గేయాలు, రూపకల్పన జానపదాలు సుమారుగా వందకు పైగా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం దేవరాజు పనిచేస్తున్న కంపెనీలో సేఫ్టీ విత్ గబ్బర్, సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్, పర్యావరణ పరిరక్షణ, హమ్ సేఫ్ సబ్ సేఫ్, ప్లాస్టిక్ ప్రభావ ప్లాస్టిక్ ప్రభవ్ అనే పలు రకాల లఘు డ్రామాలను తోటి ఉద్యోగులకు నేర్పించి, కంపెనీలో ప్రదర్శించారు. పలు షార్ట్ ఫిలిమ్స్ కూడా నిర్మించారు. కరోనాలో కళాకారుడు, అంధకారంలో అమ్మాయిలు, మానవత్వం మరిచిన మానవుడు, హుదూద్ లో ఉద్దానం రైతు, అల్లూరి సీతారామరాజు, మారండి రా మూరు?ల్లారా అనే షార్ట్ ఫిలిమ్స్ ఆయనకు మంచి పేరు తీసుకువచ్చాయి. వీటన్నిటిని తన పిల్లలు మల్లేన దేవ్ చరణ్ మల్లేన హాసినిలతో పాటు చిన్నారులతో నటింపజేశారు. అంతరించిన పోతున్న కళలను ఊపిరి పోస్తున్న దేవరాజు కృషి నిజంగానే అభినందనీయమని కళాకారులు పేర్కొంటున్నారు. ఓ వైపు సామాన్య కుటుంబం.. మరో వైపు వలస జీవితం.. ఇంకోవైపు కళలకు పోత్సాహం.. వీటన్నింటిని కలగలిపిన మల్లేన దేవరాజు జానపదాలు, ఉద్దానం కళలు బాహ్య ప్రపంచానికి చాటి చెబుతుండగా.. ఆయన ప్రయత్నాలు ఫలించాలని, మరిన్ని అవార్డులు, రివార్డులు దేవరాజు సాధించాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**పలాస, ఆగస్టు 21 (వార్త):** పలాస సబ్ – స్టేషన్లో మరమ్మత్తులు కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయబడునని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస –కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల గ్రామాలకు హరి పురం, అంబుగాము, మకరజోల పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు వినియోగదాలంతా విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# దివ్యాంగుల పించన్ల కోత ప్రభుత్వానికి తగదు

**-మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**కొత్తూరు, ఆగస్టు 21 (వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లపై విచక్షణారహిత కోతలు విధించ డంపై వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతో అనర్హులంటూ వేలాది దివ్యాంగుల పింఛన్లు తొలగించబడటం దారుణమని ఆమె మండిపడ్డారు. పింఛన్ల రీ-వెరిఫికేషన్ పేరుతో 100 శాతం దివ్యాంగులైనా ప్రభుత్వాసుపత్రులకు పిలిపించి అవమానకరంగా ప్రవర్తించడం అమానుషమని విమర్శించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, పింఛన్లను పెంచి ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దే వలంటీర్ల ద్వారా అందజేసిందని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు 4.5 లక్షల పింఛన్లను తొలగించి లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు ఉన్న ఏకైక ఆధారం పింఛన్. దానిని లాగేసి వారిని రోడ్డున పడేయడం మానవత్వం కాదు. ఇది కేవలం ప్రభుత్వ ప్రతీకారం తప్ప మరేమీ కాదు అంటూ రెడ్డి శాంతి ఆరోపించారు. ఇకపై దివ్యాంగుల పింఛన్ల కోతలపై తమ పార్టీ తరపున పోరాటాన్ని ప్రారంభిస్తామని హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదంటూ ఆమె గళమెత్తారు.




# అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి






**కొత్తూరు, ఆగస్టు 21 (వార్త):** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ గురువారం కొత్తూరు మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సిర్ల ప్రసాద్, యూనియన్ నాయకులు యస్. ధనలక్ష్మి, చి. జలజాక్షి నాయకత్వంలో జరిగిన ఈ ఆందోళనలో వేతనాలు పెంచాలని, ఎఫ్.ఆర్.ఎస్ యాప్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వేతనాలు గత ఆరు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం, డి.ఏ, పి.ఆర్.సి అమలు చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గర్భిణీలు, బాలింతలకు ఇబ్బందులు కలగకుండా ఎఫ్.ఆర్.ఎస్ యాప్ ను వెంటనే రద్దు చేయాలని కోరారు.ప్రస్తుతం అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వమే ఇచ్చిన సెల్ఫోన్లు పాతబడిపోవడంతో యాప్లు, ఆన్లైన్ పనులను సరిగా చేయలేకపోతున్నామని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా కొత్త ఫోన్లు ఇవ్వకపోవడమే కాకుండా, వాగ్దానం చేసిన ట్యాబ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పని చేయని ఫోన్లను ఇప్పటికే అధికారుల కార్యాలయాలకు అప్పగించామని తెలిపారు.ఒకే దేశంలో ఒకే యాప్ ఉండేలా పోషణ్ ట్రాకర్ అమలు చేయాలని, నాణ్యమైన ట్యాబులు, 5జి ఇంటర్నెట్ను అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, మినీ అంగన్వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చి జీవో ఇచ్చేలా చూడాలని ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.అలాగే హెల్పర్లకు ప్రమోషన్ విధానాలు రూపొందించాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన పథకాన్ని కొత్తగా అంగన్వాడీల భాధ్యతలో వేయకూడదని కూడా స్పష్టం చేశారు. ఈ ధర్నాలో అమ్మాయమ్మ, శ్రీలత, విజయ, భవాని, లక్ష్మి, జ్యోతి, మధురవేణి, పార్వతి పాల్గొన్నారు.

**పలాస:** దేశ వ్యాప్తంగా అంగన్వాడీ యూనియన్ పిలుపులో భాగంగా కాశీబుగ్గ ఐసిడియస్ కార్యాలయ వద్ద అంగన్వాడీలు గురువారం ధర్నా చేపట్టారు. కనీస వేతనాలు అమలు చేయాలని, యఫ్ ఆర్ యస్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యూటీ జి ఓ మార్పు చేయాలని, ఐ సి డి యస్ ను బలోపేతం చేయాలని కోరారు. ,మినీలను 10 వ తరగతి నిబంధనలులో మినహాయింపు నిచ్చి అందరినీ ప్రమోట్ చేయాలని, తదితర డిమాండ్ లతో నినాదాలు చేశారు. అనంతరం కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఓ పార్వతికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా సీఐటీయూ నాయకులు యన్ గణపతి, యన్ మోహనరావు, యూనియన్ అధ్యక్షులు యం మంజులా కుమారి, కార్యదర్శి బి సునీత లు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యేదాకా దశలవారీ పోరాటం సాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే యూనియన్ నాయకులుతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి సునీత, బి చామంతి, బొకర సునీత, బి నిర్మల, కె సరస్వతి, ఆర్ పార్వతి, పి కళ్యాణి, ఇందు, పి పద్మావతి, యస్ నిర్మల,అంగన్వాడీలు ఆయాలు, పాల్గొన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు బమ్మిడి ఆనందరావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర




**పలాస, ఆగస్టు 21 (వార్త):** స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నందు 2025 ఆగస్టు నెల సందేశం క్రింద "మాన్సూన్ హైజిన్"అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశుభ్రత చర్యలు చేపట్టబడినవి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. వెంకటలక్ష్మి అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. బి. మధు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారంతో శుభ్రతా పనులు నిర్వహించారు. ప్రధాన చర్యలలో భాగంగా కళాశాల ఆవరణంలో మురికి నీరు నిలిచే ప్రాంతాల్లోని ఎండిన ఆకులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చిత్తుకాగితాలు తొలగించి నీరు తొలగిపోయే మార్గాన్ని ఏర్పరచారు. దోమలు పెరగకుండా నిరోధించేందుకు, నిల్వ ఉన్న నీటి గుంతలను చిప్స్ మట్టితో పూడ్చడమైంది.ఈ కార్యాచరణ ద్వారా విద్యార్థుల్లో మాన్సూన్ హైజిన్ పట్ల అవగాహన పెరిగే విధంగా, సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇవ్వగలిగారు. ఇది ఆరోగ్యకరమైన వర్షాకాల జీవనశైలికి ప్రేరణగా నిలిచినది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపత్ రావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ పి. వెంకట రమణ, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్. శ్రీనివాస పట్నాయక్, లైబ్రేరియన్ బి. నరసింహులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## టైలరింగ్ శిక్షణ వ్యవధి పొడిగింపు

**కొత్తూరు, ఆగస్టు 21 (వార్త):** కొత్తూరు పంచాయతీలో ఉన్నటువంటి టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శిరీష సందర్శించారు. ఈ సందర్శనలో శిక్షణ పొందుతున్న మహిళలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. మహిళలు మరింతగా నైపుణ్యాన్ని పొందేందుకు శిక్షణ కాలాన్ని 90 రోజుల నుండి 100 రోజులకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. శిక్షణ కాలం పెరగడం వల్ల మహిళలు మరింత పరిజ్ఞానం సంపాదించి, స్వయం ఉపాధి అవకాశాలను సులభంగా పొందగలరని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి మహిళ ఆర్థికంగా ముందుకు సాగేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేసి, శిక్షణ అనంతరం స్వయం ఉపాధి అవకాశాలతో తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకుంటామని తెలిపారు.

## సొండిపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ



**మందస, ఆగస్టు 21(వార్త):** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 'పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ' జిల్లాస్థాయి పోటీలలో మందస మండలంలోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోనారి విజయ, తెలుకల హర్షిత, దివిలి నిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. కోనారి విజయ 550 సంతకాలు సేకరించి ముందంజలో నిలిచాడు. పాఠశాల విద్యార్థులు ఆయా గ్రామాలు తిరుగుతూ పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, ప్రజలను చైతన్యపరిచి, ఇక ముందు మేము పొగాకు జోలికి వెళ్ళమని వారి నుంచి ప్రమాణం చేయించి, వారి నుంచి సంతకాలు సేకరించారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు విద్యార్థులకు మల్టీపర్పస్ బ్యాగులను బహుకరించింది. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్, సిబ్బంది అభినందించారు. పాఠశాలకే గర్వకారణమన్నారు.

## ఈదురాపల్లి ఋణం తీర్చుకోలేనిది

**పలాస, ఆగస్టు 21 (వార్త):** ఈదురపల్లి రుణము తీర్చుకోలేనిదిని కాశిబుగ్గ శివాజీ నగర్ లో ఉన్న షిరిడి సాయి మందిరం సంస్థ, ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త దువ్వాడ శ్రీధర్ (బాబా) అన్నారు. గురువారం ఈదురపల్లి గ్రామానికి చెందిన యువత వినాయక చవితి సందర్భంగా పందిరి రాట చేసేందుకు విరాళం అందజేశారు.ఈదురాపల్లి గ్రామంలో యువతతో...ఏమి ఇచ్చి తీర్చుకోగలను ఋణం...ఈదురాపల్లి గ్రామానికి..నా సొంత ఊరు ఏది అంటే ఈదురాపల్లి అనే చెప్పుకుంటా..భవిష్యత్ లో ఈదురాపల్లి లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటున్నాని,దేవుడు సహకరిస్తే భవిష్యత్ జీవితం ఈదురాపల్లిలో నా కుటుంబం తో గడపాలని కోరుకుంటానని చెప్పారు. ఈ నెల 27 న జరగనున్న వినాయక చవితి పండగ సందర్భంగా గ్రామ కమిటీ చేసే దైవ కార్యక్రమంనకు 10.000 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ గ్రామాల్లో ఐక్యతకు నిదర్శనంగా వినాయక చవితి మహోత్సవాలు కలిసికట్టుగా చూసుకోవడమేనని చెప్పారు. ఈదురపల్లితో విడదీయని బంధం ఏర్పడిందని, ఆ గ్రామాన్ని భవిష్యత్తులో దత్తత తీసుకుని సుందరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నానని చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉప రాష్ట్రపతికి రాజశేఖర్ నామినేషన్ ఆమోదం



**జలుమూరు, ఆగస్టు 21 (వార్త):** భారత ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసిన నాయుడు గారి రాజశేఖర్ నామినేషన్ బుధవారం రాజ్యసభ ఎన్నికల అధికారి ఆమోదించారు. నామినేషన్ అనుమతి పత్రం అందుకున్నట్లు రాజశేఖర్ తెలిపారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తాను పోటీ చేసే ప్రధాన కారణం తన గ్రామాన్ని ఢిల్లీ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమేనని చెప్పారు. దక్షిణకాశీగా పేరుగాంచిన పవిత్ర శ్రీముఖలింగ క్షేత్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాజశేఖర్ స్పష్టం చేశారు.



## మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయండి

**నరసన్నపేట, ఆగస్టు 21 (వార్త):** నరసన్నపేట వ్యవసాయ యార్డ్ లో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లుతో సాధారణ సభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. కార్యాలయం వద్ద రహదారులు, ప్రహరీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ , డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా హెచ్ఎంల సంఘం కార్యవర్గం ఇదే



**వీరఘట్టం, ఆగస్టు 21 (వార్త):** జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గాన్ని గురువారం పార్వతీపురంలోని డివిఎంఎం హైస్కూల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి సి హెచ్ శ్రీనివాసరావు (ఉల్లి భద్ర హై స్కూల్ ), ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ రత్నాకర్ రావు (బిటివాడ హై స్కూల్ )కోశాధికారిగా కే ప్రసాదరావు (పార్వతీపురం ఎంఈఓ 2 )గౌరవ అధ్యక్షులుగా జి రవి ప్రసాద్ (నీలానగరం హై స్కూల్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టేట్ కౌన్సిలర్లుగా డి సూర్యచంద్రరావు( సీతంపేట ఎంఈఓ 2) ఎం శ్రీనివాసరావు (జియ్యమ్మ వలస ఎంఈఓ 2) టి శంకర్రావు (కురుపాం హై స్కూల్ )మహిళా ఉపాధ్యక్షులుగా డి నాగమణి (తెట్టంగి హై స్కూల్) పి రామకృష్ణ( ఎన్ ములగ హై స్కూల్ )మహిళా ప్రతినిధిగా జె ప్రపూర్ణకుమారి (తోటపల్లి హై స్కూల్ )లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయుల సంఘం ఒక ప్రకటనలో తెలిపారు

## 10వ వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో వర్షాకాల ప్రభావం వలన మురుగుకా లువల ప్రవాహాన్ని అడ్డులేకుండా ఉండుటకు కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో 10వ వార్డు ఖార్జీ వీధి, పొన్నాడ వీధులలో మురుగు కాలువలలోని పూడికను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు. పురుషోత్తపురం 1, 2వ వార్డులో ఫాగింగ్ చేపట్టారు.

## సురంగి రాజా మైదానం పరిశీలించిన ఏసీఏ టాలెంట్ సెర్చ్ కమిటీ హెడ్

**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** సురంగి రాజ మైదానంను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ సెర్చ్ కమిటీ హెడ్ రవిచలం పరిశీలించారు., జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ హాసన్ రాజా ,జాయింట్ సెక్రెటరీ నగిరి బెనర్జీ , ఐసీసీ సబ్ సెంటర్ మరియు రాజా గ్రౌండ్ ను పరిశీలించి గ్రౌండ్ అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేస్తామని అన్నారు. క్రికెట్ క్రీడాకారులను ఉద్దేశించి వారి యొక్క అభివృద్ధికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిసి క్రికెట్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసరి రాజు, ఐసీసీ సబ్ సెంటర్ నెంబర్ అలీమ్ ఖాన్, బత్తుల వెంకటరమణ, చాట్ల లోహిదాస్, సాలిన గణేష్, లెవెల్ 1 కోచ్ మేఘనాథ్, ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ కోచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.



# పలాస కిడ్నీ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలు

**-రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం**

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, ఆగస్టు 21(వార్త):** రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు అత్యంత ఆధునిక పరికరాలు రెండు కోట్ల రూపాయలతో ప్రారంభించామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్లో ఆధునిక వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలు మరింత సులభతరం చేసేందుకు రూ.2 కోట్ల నిధులతో వీటిని సమకూర్చామని చెప్పారు. కిడ్నీలో రాళ్లు తొలగించడం, కిడ్నీ మార్పిడితో పాటు వివిధ రకాల ఆపరేషన్లు కత్తెర ముట్టకుండానే కేవలం అత్యాధునిక పరికరాలను ఉపయోగించి రోగికి శస్త్ర చికిత్స చెయ్యొచ్చని తెలిపారు. కిడ్నీ రోగులతో పాటు మహిళలకు గైనిక్ చికిత్సలకు కూడా ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జా బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు సప్ప నవీన్, బడ్డ నాగరాజు, పిరుకట్ల విఠల్, దువ్వాడ శ్రీకాంత్, టంకాల రవిశంకర్ గుప్తా, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రద్దయిన దివ్యాంగ పింఛనుదారులూ.. దరఖాస్తు చేసుకోండిలా!



**పలాస, ఆగస్టు 21 (వార్త):** కొన్ని సాంకేతిక కారణాలతో రద్దయిన లేదా పెన్షన్ రకం మారిన అసలైన దివ్యాంగులు నిరాశ చెందకుండా మరలా దరఖాస్తు చేసుకున్నచో తిరిగి వారి దివ్యాంగ పెన్షన్లు పునరుద్ధరించ బడతాయని కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు. పలాస పురపాలక సంఘంలో మొత్తం రద్దయిన దివ్యాంగ పెన్షన్లు 27 కాగా, అందులో 5 పెన్షన్లు వృద్ధాప్య పెన్షన్లుగా మార్పు చేయడం జరిగింది, మిగిలిన 22 మంది కూడా మరల ఈదిగువ తెలిపిన విధంగా దరఖాస్తు చేసుకున్నట్లయితే వారి దరఖాస్తులను పరిశీలిస్థామని చెప్పారు. ఇందులో మొదటగా రద్దయిన ఫించన్ దారుడు అప్పీలు కోరుతూ మున్సిపల్ కమిషనర్ వారికి దరఖాస్తు చేసుకోవలెనని, సదరు దరఖాస్తునకు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రద్దయిన లేదా మార్పు చెందిన పెన్షన్ నోటీసు కాపీ, సదరం సర్టిఫికెట్ పాతది, సదరం సర్టిఫికెట్ కొత్తది, పెన్షన్ దారుడు ప్రస్తుతము ఏదైనా హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లయితే అందుకు సంబంధించిన డాక్యుమెంట్ల కాపీలు సదరు అప్పీలు దరఖాస్తుతో పాటు జత చేయవలెను. అప్పీలు చేసుకున్న దరఖాస్తుదారులకు మరియొకసారి తిరిగి వైద్య పరీక్షల కొరకు నోటీసు జారీ చేస్తారని కమిషనర్ వెల్లడించారు. రద్దయిన పెన్షన్ దారులు తిరిగి వైద్య పరీక్షలకు హాజరు కావలసి ఉంటుందని కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## వినాయక ఉత్సవాల మండపాలకు అనుమతి తప్పనిసరి

**-ఆన్‌లైన్‌లో తప్పక దరఖాస్తు చేసుకోవాలి**

**-కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు,**

**మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్**



**మందస, ఆగస్టు 21(వార్త):** వినాయక చవితి ఉత్సవాలకు మండపాలు నిర్వహించే నిర్వాహకులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కాశీబుగ్గ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మందస పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు అనుమతికై ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా గణేష్ఉత్సవ్.నెట్(ganeshutsav.net)ను ప్రారంభించిందన్నారు. మండపాలకు సింగల్ విండో విధానం ద్వారా ఆన్లైన్లో అనుమతులు పొందవచ్చన్నారు. రోడ్డు మధ్యలో మండపాలు ఏర్పాటు చేయకూడదన్నారు, మండపాల వద్ద పరిమితికి మించిన ధ్వనితో డీజేలు ఉండకూడదని సూచించారు. డిజె సౌండ్ సిస్టం ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినాయక ఉత్సవాలలో రాత్రి 10 గంటల వరకే మైక్ సిస్టం ఉండాలన్నారు. బాణా సంచా కాల్చడం కోసం ముందస్తు అనుమతి పొందాలన్నారు. నిర్వాహకులు గణేషుని నిమజ్జన సమయంలో భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండపాలు అనుమతికి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారని తెలిపారు. మండపాల నిర్వహణలో నిబంధన తప్పనిసరిగా పాటించాలని కోరారు. భక్తులు ఈ విషయంలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిశీలన

**జలుమూరు, ఆగస్టు 21 (వార్త):** ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు విద్య పట్ల శ్రద్ధ కలిగే దిశగా కృషి చేయాలని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. జలుమూరు మండలం హుస్సేన్ పురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ క్రమంలో విద్యార్థులతో కలిసి వారి బోధన ఏ విధంగా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే సరైన విద్య పట్ల శ్రద్ధ వహించినట్లు చేస్తే భవిష్యత్తులో ఫలితాలు సాధించవచ్చు అన్నారు.

రాణపంచాయతీ గొలియపుట్టి గ్రామ పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు పరిశీలించారు

. ప్రభుత్వం ఇస్తున్న మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని పిల్లలని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు హెచ్ఎం బి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు దారుణం

**జలుమూరు, ఆగస్టు 21 (వార్త):** పలు దివ్యాంగుల పెన్షన్ రద్దు చేయడం ఎంతవరకు సమంజసం అని నాయుడుగారి రాజశేఖర్ అన్నారు. జలుమూరు మండలంలో 238మంది దివ్యాంగుల పెన్షన్లుకు గాను కనీసం 90 శాతం మంది అర్హత కలిగిన దివ్యాంగులు పెన్షన్లను రద్దు చేశారు. దివ్యాంగులను అధికారుల చుట్టూ పదే పదే తిప్పించుకోవడం వికలాంగుల హక్కులకు భంగం కలిగించినట్లు కదా. కూటమి ప్రభుత్వానికి చెందిన దివ్యాంగులకు 100% 80% సదరం డాక్టర్లు తో మేనేజ్ చేసుకుని ధ్రువీకరణ పత్రాలు ఇస్తూ అక్రమంగా పెన్షన్ ఇచ్చేస్తున్నారు.కొంతమంది నకిలీ ధ్రువీకరణ పత్రాలుతో దివ్యాంగ పెన్షన్ పొందినప్పటికీ వాళ్ల పెన్షన్స్ అలాగే కొనసాగించడం కూడా చట్టరీత్యా తప్పు కదా?అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హత లేని వారికి పెన్షన్ ఇస్తూ అర్హత ఉన్న వారికి రద్దు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ తక్ష ణమే విచారణ జరిపి పార్టీలకతీతంగా దివ్యాంగ పింఛన్ల మంజూరు చేయాలని కోరారు.



# అఘాయిత్యాలను అరికట్టాలి

**-టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల**

**మెళియాపుట్టి, ఆగస్టు 21(వార్త):** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి మరియు ఛైర్పర్సన్, మండల న్యాయ సేవాధికార సంస్థ బి. నిర్మల అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్, అమరావతి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శ్రీకాకుళం వారి ఆదేశాలు మేరకు మెళియాపుట్టి మండలంలో గల రామచంద్రాపురం గిరిజన గ్రామంలో గురువారం నాడు జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో ఆమె మాట్లాడుతూ గిరిజనల కోరకు రూపొందించిన చట్టాలు పై అవగాహన కలిగి ఉండాలని, అలాగే వారికి న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తోందని, న్యాయ సహాయం అవసరమైన వారు టెక్కలి మండల న్యాయ సేవాధికార సంస్థను సందర్శించవచ్చని తెలియజేస్తూనే ప్రతి పనికి జవాబుదారీతనం ఉండాలని, పౌర హక్కుల చట్టాన్ని ప్రతి ఒక్కరు అమలు చేయాలని ఆమె సూచించారు. ఈ సదస్సులో టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, న్యాయవాదులు డి.వి. వివేకానంద, కె.బాబురావు, మెళియాపుట్టి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ పి.రమేష్‌బాబు, మెళియాపుట్టి మండల జెడ్.పి.టి.సి. సభ్యులు గూడ ఎండయ్య కోర్ట్ స్టాఫ్ అమ్మినాయుడు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**నరసన్నపేట, ఆగస్టు 21(వార్త):** నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో వరి పంటలకు పురుగులు సోకకుండా కషాయం తయారు చేయించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ డిపిఎం, ధనుంజయ్ అన్నారు. బుధవారం స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఉన్న రైతు సేవా కేంద్రంలో నాలుగు మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సంధర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరి పంటలో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న గ్రామాల్లో రైతాంగానికి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, నీమాస్త్రం, జిల్లేడు ద్రావణం, పంచగవ్య వంటి ద్రావణాలు ఎలా తయారుచేయాలో నేర్పించాలని తెలిపారు. అంతేకాకుండా రైతులతో వరి పొలాల గట్లపై బంతి, కంది, ఇతర కూరగాయలు నాటించాలని, తద్వారా పురుగులు, తెగులు రాకుండా వరి పంట అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ట్రైనింగ్ ఎన్ఎఫ్ఎ, గోవిందరెడ్డి, శివాజీ, నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్, తోట రమణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, కే. రాజేశ్వరమ్మ, బి. సీతారామయ్య, డి. మేరి, ఏ. తారకరామారావు పాల్గొన్నారు.

# దేశ ప్రజలకు ఉచిత సేవలందిస్తున్న బి.ఎస్.ఎన్.ఎల్

**నరసన్నపేట, ఆగస్టు 21 (వార్త):** భారతదేశ ప్రజలకు ఉచితంగా భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఉచితంగా సేవలు అందిస్తోందని బిఎస్ఎన్ఎల్ జెటిఓ, క్రాంతికుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాదీకా అమృత మహోత్సవ్ భాగంగా బిఎస్ఎన్ఎల్ సంస్థ పురోభివృద్ధి, రాబోవు రోజుల్లో చేపట్టబోయే వివిధ పథకాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్, శాంతి హేమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెటీఓ, క్రాంతికుమార్ మాట్లాడుతూ తక్కువ రేడియేషన్ విడుదల చేస్తూ, వాయిస్ మేసేజ్, బ్రాడ్ బ్రాండ్, ఫైబర్నెట్, వాయిస్ డేటా అందచేస్తూ, అతి తక్కువ ధరలకు నాణ్యత కల్గిన సిమ్లను అందచేస్తుందని తెలిపారు. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు, విధ్యార్థులకు ఉచితంగా సిమ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డా.పి. అన్నాజీరావు, డా.జి.రవికుమార్, డా. పూజా భరధ్వాజ్, డా.పి. త్రినాధరావు, పవిత్ర, కృష్ణవేణి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌సి అభ్యర్ధులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ



**వీరఘట్టం, ఆగస్టు 21 (వార్త):** ఎస్ సి అభ్యర్ధులకు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. డ్రైవింగ్ స్కూల్ లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంస్థ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు గురు పురుషులు, ఐదు గురు మహిళలకు వెరసి పది మంది అభ్యర్ధులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. శిక్షణకు అయ్యే ఖర్చు పూర్తిగా ఎస్ సి కార్పొరేషన్ భరిస్తుందని ఆయన పేర్కొన్నారు. 20 సంవత్సరాలు వయస్సు పైబడిన ఆసక్తిగల షెడ్యూల్డు కులముల అభ్యర్ధులు, కనీసం 1 సంవత్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేయవచ్చని ఆయన వివరించారు. దరఖాస్తులను కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంస్థ, డా. మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం-535003 చిరునామాకు ఈ నెల 27వ తేదీ లోగా సమర్పించాలని ఆయన తెలిపారు. ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. డ్రైవింగ్ స్కూల్ ద్వారా హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సమర్పించే దరఖాస్తులో అభ్యర్ధి పేరు, తండ్రి/భర్త పేరు, పుట్టిన తేది, వయస్సు, విద్యార్హత (జెరాక్సు కాపీ జత చేయవలెను), ఆధార్ కార్డు నెం. (జెరాక్సు కాపీ జత చేయవలెను), లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జీ సంఖ్య, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ సంఖ్య, కాలపరిమితి వివరాలు (జెరాక్సు కాపీ జత చేయవలెను), హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ఎల్ ఎల్ ఆర్ సంఖ్య, కాలపరిమితి వివరాలు (జెరాక్సు కాపీ జత చేయవలెను), మొబైల్ నెంబర్, చిరునామా, పిన్ కోడ్, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి నియమ నిబంధనలకు తెలియజేయు అంగీకారము (అవును/కాదు) - నేను ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. డ్రైవింగ్ స్కూల్ నియమ నిబందనల ప్రకారము హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ తీసుకొనుటకు నా యొక్క పరిజ్ఞానముతో అన్ని వివరములు సరైనవని తెలియజేయుచూ, మనస్ఫూర్తిగా అంగీకారము తెలియజేయుచున్నాను అనే అంగీకార పత్రంతో సహా సమర్పించాలని ఆయన సూచించారు. ఆసక్తి గల అభ్యర్ధులు సమాచార నిమిత్తం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్: 9030014742, సీనియర్ అసిస్టెంట్,: 96424 60838, జూనియర్ అసిస్టెంట్: 9652600967 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.



## 2 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** తిరుపతి జిల్లా రేణిగుంటలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ కి చెందిన అనుజ్ కుమార్(25) అనే వ్యక్తి ని ఇన్‌ఛార్జ్ టౌన్ ఎస్ ఐ రవివర్మ అరెస్టు చేసినట్లు సి ఐ ఎం. చిన్నం నాయుడు చెప్పారు.బట్టలు షాప్ లో పని చేస్తూ ఒడిశా కి చెందిన సాగర్ అనే వ్యక్తి తో పరిచయం చేసుకునిఅమిత్ జాస్వాల్ అలియాస్ అమిత్ చౌదరి కి గంజాయి అందిస్తే కిలోకి 8500 రూపాయలు కిరాయి కుదుర్చుకుని బరంపురం లో 2.70 కిలోల గంజాయి కొని తీసుకుని వెళ్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## పీర్లకొండను అభివృద్ధి చేయండి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** రత్తకన్న లో గల మత సామరస్యానికి ప్రతీక గా నిలిచే పవిత్ర పీర్ల కొండ ను అభివృద్ధి చేయాలని తెలుగుదేశం సీనియర్ నాయకులు సుభాష్ రౌలో కోరారు. ఈ మేరకు ఢిల్లీ లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులు తో మరమ్మతులు చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దర్గా, మసీదు ,మెట్లు అభివృద్ధి చేయాలని లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వీరఘట్టం, ఆగస్టు 21 (వార్త):** నవగాం ఉప కేంద్రం పరిధిలో ఈనెల 22న విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈ ఈ కే విష్ణుమూర్తి గురువారం విలేకరులు తెలిపారు 11కేవీ బోడ్లపాడు ఫీడెర్ నందు ట్రాన్స్ఫార్మర్ నిర్వహణ మరియు చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం మరియు బోడ్లపాడు ఫీడేర్ పరిధిలో పనులు చేయుట వలన పీడరు పరిధిలో ఉన్నటువంటి అన్ని గ్రామములకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు కావున వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## జనసేన పార్టీ దృష్టికి ఉద్దాన వాటర్ ప్రాజెక్ట్ కార్మికుల తొలగింపు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** జనసేన పార్టీ నాయకులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు దృష్టికి ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్ లో తొలగించిన కార్మికుల సమస్య ను తీసుకువెళ్లారు. గత 27 ఏళ్ల నుండి ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్ లో పనిచేస్తున కార్మికులు, కరోనా, తుఫాన్ సమయాల్లో తమ్మల్ని వినియోగించుకున్నారని. అరకొర జీతాలతో దీన్ని నమ్ముకుని జీవిస్తున్నామని అన్నారు.. కానీ అఫీషియల్ గా 2025 లో మెగా సంస్థకి ఉద్దానం వాటర్ ప్రాజెక్ట్ కి విలీనం చేస్తూ మా కార్మికులు అందరినీ అర్ డబ్ల్యు ఎస్ డిపార్ట్మెంట్ విలీనం చేశారని, విలీనం టైం లో 28 మంది కార్మికుల్ని తొలగించారని. వారికి న్యాయం చేయమని పదేపదే అధికారుల్ని, కలెక్టర్ కి మెగా కంపెనీ కు విన్నవించకున్నా పట్టించుకోలేదని అన్నారు.. ఇప్పుడు అర్ధాంతముగా ఆగస్టు 13 న వాట్సాప్ మెసేజ్ ద్వారా 77 మందిని ఎటువంటి కారణము లేక నిర్ధాన్యముగా తొలగించారని అన్నారు. అదేవిధంగా కార్మికులు అందరూ కోరుకునే టట్టు.ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , స్థానిక కూటమి ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్. బెందాళం అశోక్ బాబు దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యపై పూర్తిగా జనసేన పార్టీ తరపున మీకు న్యాయం చేసే విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని రాజు కార్మికులకు హామీ ఇచ్చారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546